# పగిలిన అద్దం

పెళ్ళికూతురైనా సిగ్గుపడటం చేతకాలేదు పిచ్చిపిల్ల రాజ్యలక్ష్మికి. గలగలా నవ్వుతూ యిల్లంతా హడావిడిగా తిరుగుతూనే వుంది — కొత్త బట్టలు ఎగరేసుకొంటూ.

"అవతల మొగుడొచ్చి పందిట్లో కూర్చుని వుంటే నువ్వింకా చిన్న పిల్లనే అనుకుంటున్నావేమిటీ?" — అంటూ ఓ పేరంటాలు రాజ్యాన్ని బలవంతంగా గదిలో కూర్చోబెట్టి తలమీద చెయ్యి వేసి అణిచి పెట్టింది — "అలా తల వంచుకు కూర్చో."

బిక్క మొహం పెట్టింది రాజ్యం.

"ఇంత పిచ్చి పిల్లవేమే? ఎంచక్కా పెళ్ళి కూతురు వయ్యావు కదా? తల దించుకు సిగ్గు పడుతూ కూర్చోమంటే ఏడుపు మొహం పెడతావేం?

నిజానికి రాజ్యం పిచ్చిదో వెర్రిదో కాదు. సామాన్యంగా వుండే వివేకం మాత్రం లేదు. పధ్నాలుగేళ్ళ రాజ్యం — పెద్దమనిషయి అప్పుడప్పుడూ చీరలు కూడా సింగారించుకునే రాజ్యం - బొత్తిగా చిన్న పిల్లలా గంతులేస్తూ వుంటుంది. చీటికీమాటికీ పకపకా నవ్వుతూంటుంది. తిండి తిన్నదే ఆలస్యంగా ఏ పొరుగింటికో పోతుంది. పొద్దస్తమానూ — గచ్చకాయలో, చింతపిక్కలో ఆడుకుంటూ కూర్చుని దీపాలు పెట్టేవేళకు పరుగెత్తుకు యింటికి వస్తుంది. కోపం ఆగక వాళ్ళమ్మ తిడితే పెద్ద నోరు పెట్టి కాళ్లు నేలకేసి బాదుకుంటూ ఏడుస్తూ కూర్చుంటుంది. — "ఇలాంటి పిచ్చి ముద్దు నిచ్చావేమిరా దేవుడా! దీన్నెలా కడతేర్చనూ!" - వాళ్ళమ్మ కున్న బాధల్లా అదేను. కడతేర్చటమంటే ఏమిటో రాజ్యానికి అర్థం కాదు — "నన్ను చచ్చిపొమ్మని తిడుతున్నావు కదూ?"- అంటూ బావురుమంటుంది — "నిన్నెందుకు చావమంటానే? నీ బాధ భరించ లేకపోతే నేనైనా చస్తాను గానీ."

"నువ్వు మాత్రం ఎందుకేవిటి చావటం!"

"మరేం చెయ్యను నీ లాంటి కూతుర్ని కని? నిన్నో అయ్యచేతిలో

పెడితే నా పరువు దక్కేనా? అసలింత లోకజ్ఞానం తెలీని నీకు మొగుడెలా వస్తాడే."

"ఛీ! నాకు మొగుడెందుకూ?"

"ఎల్లకాలం నా దగ్గిరే కూర్చుంటావా? చూడు! చక్కగా మొన్న సీత పెళ్ళి చేసుకుని అత్తారింటి కెళ్ళలేదూ? అలా నువ్వుకూడా లక్షణంగా పని పాటలు నేర్చుకుని ...."

"నాకు బోలెడు పాటలు వచ్చుగా?"

"పని మాత్రం రావద్దూ?"

"నువ్వు చేస్తావుగా?"

"ఇదేగా నీ వరస? పిచ్చి ముండా!"

అలాంటి రాజ్యానికి పెద్దమనిషై ఏడాది దాటకుండానే పెళ్ళిసంబంధం కుదిరిందంటే వూళ్ళో చిన్నా పెద్దా అంతా నోళ్ళు తెరిచారు. రాజ్యం మేన మామ ఓ సారి రైల్లో వస్తోంటే పరిచయమైన ఓ పెద్దమనిషి అతనితో పాటే పల్లెటూరు వచ్చి రాజ్యాన్ని పెళ్ళిచూపులు చూశాడు. ఎర్రపట్టు పరికిణీ కట్టి బంతి పువ్వులు జడనిండా కుట్టి చూపించారు రాజ్యాన్ని.

"ఛీ! వాడెందుకూ నన్ను చూడ్డం?" — అని కాస్సేపు గంతు లేసినా వాళ్ళమ్మ బ్రతిమిలాడితే ఓ క్షణం చావిట్లో చాపమీద బుద్ధిగానే కూర్చుంది రాజ్యం.

రాజ్యం ఏపుగా బొద్దుగా ఆరోగ్యంగా ఉంటుంది. తెల్లటి శరీరం! అందమైన మొహం. ఎంత వెకిలి గంతులేస్తోన్నా రాజ్యాన్ని చూసినకొద్దీ చూడాలనిపిస్తుంది. ఆ వచ్చిన పెద్దమనిషి పెళ్ళి ఖాయమేనని మాట ఇచ్చి మరీ వెళ్ళాడు. కట్నాల మాటా కానుకల మాట పెద్దగా ప్రస్తావించలేదు. రాజ్యం వాళ్ళమ్మ కూతురి అదృష్టానికి తెగ మురిసి పోయింది. — "అమా యకుల్ని భగవంతుడు ఓ కంట చూస్తూనే వుంటాడు" – అనుకొంది.

"అసలు పిల్లాడె లాంటి వాడో? లేక పోతే వాళ్ళంత కంగారుగా సంబంధం కుదుర్చుకు వెళ్తారూ?" వూళ్ళో వాళ్ళు చేసిన వూహా ,గానాలన్నీ

పెళ్ళి కొడుకుని కాస్తా పెళ్ళి పీటలమీద చూడటంతో గాలిలో కలిసి పోయాయి.

పెళ్ళి కొడుకు — రఘునాధ్ తెల్లగా సన్నగా అతి నాజూగ్గా నవ మన్మధుడిలా ఉన్నాడు. పట్నంలో బి. ఎ. చదువు తున్నాడు. పల్కరించిన వాళ్ళందరితోటి చక్కగా వినయంగా మాట్లాడాడు.

రఘునాధ్ రాజ్యం మెడలో తాళి కట్టనేకట్టాడు. చివరికి అందరూ పిచ్చిపిల్ల రాజ్యం అదృష్టాన్ని ఒప్పుకోక తప్పలేదు — మర్నాడే రాజ్యాన్ని అత్తారింటికి తీసుకెళ్ళిపోయారు.

*　　　*　　　*

"అత్తా! రాజీ వచ్చిందటకాదూ?" సీత గొంతు వింటూనే గదిలో మంచంమీద పడుకొని దొర్లుతోన్న రాజ్యం ఒక్క పరుగులో లేచివచ్చి సీతని కావలించు కున్నంత పనిచేసింది — అత్తారింట్లో వుంచిన మూడు రోజులూ రాజ్యానికి కటకటాల్లో బంధించినట్టే వుంది. తనలా చిన్న పిల్లలెవరూ లేరు. ఒక్కళ్ళకీ పచ్చీసు ఆడటం రాదు. ఎప్పుడూ నోరు విప్పి నవ్వుకోరు. అస్తమానం ఎవళ్లో రావటం చూడటం - తినమనటం ఛ .... ఏం బావుంటుందనీ!

సీతని చూస్తే ప్రాణం లేచివచ్చింది రాజ్యానికి. "కాసేపలా చెరువుకేసి వెళదాం వస్తావేమిటే?" సీత మాటలు పూర్తికాకముందే పరికిణీ ఎగ రేసుకుంటూ వీధిలోకి పరిగెత్తింది రాజ్యం.

"ఎలాగూ వెడుతున్నావు. బిందితీసికెళ్ళి కాసిన్ని నీళ్ళు తీసుకు రాకూడదటే?" — అంటూ ఆపింది వాళ్ళమ్మ. కూజాబింది కాస్తా చంకన పెట్టుకు బయల్దేరింది రాజ్యం. చెరువుగట్టున మర్రిచెట్టు క్రింద కూర్చున్నారిద్దరూ — "ఒసే రాజ్యం! నిన్ను బోలెడు కబుర్లడుగుతాను సరిగ్గా చెపుతావా?"

"అడుగూ" — అంటూ వో రాయి తీసి నీళ్ళలోకి గిరవాటెట్టింది రాజ్యం.

"అదిగో, నువ్వలా చిలిపి పనులు చేస్తేకాదు, నా మాట సరిగ్గా విను మరి!"

బుద్ధిగా కూర్చుంది రాజ్యం.

సీత నవ్వుతూ అంది – "అక్కడ మీ అత్తవారి యిల్లూ అదీ ఎలా ఉన్నాయో చెప్పు. వాళ్ళకి చాలా డబ్బు వుందటకదూ!"

"ఏమో! డబ్బునాకు చూపించలేదుగా? వాళ్ళ యిల్లు మాత్రం ఎంత బావుందనుకున్నావ్! పెద్దమేడ, అబ్బో! ఎన్ని గదులో! వాళ్ళకి చక్కటి బుల్లికారు కూడా వుంది. నేను బోలెడుసార్లు కారెక్కాను, తెలుసా?"

రాజ్యం గర్వంగా చూస్తూ నవ్వింది. సీత – "పోనీగానీ మరో మాట చెప్పు, ఆ మూడు రోజులూ నువ్వెక్కడ పడుకున్నావ్?"

"మేడమీదే"

"ఏ గదిలో? మీ ఆయన పడుకున్న దగ్గరే కదూ?"

"ఊహు! వాళ్ళమ్మ దగ్గరే పడుకున్నాను."

"అదేవిటి? నువ్వూ మీ ఆయనా ఓ గదిలో పడుకోలేదూ?"

"ఛీ! ఎందుకూ?"

సీత నవ్వు దాచుకొంటూ అంది "మీ ఆయన నీతో చాటు చాటుగా మాట్లాడ లేదూ?"

"నాతో ఏం మాట్లాడుతాడూ?"

గుస గుస లాడుతున్నట్టే అంది సీత .. "పోనీ ఒక్కసారయినా ముద్దు పెట్టుకోలేదూ?"

అదిరి పడింది రాజ్యం – "ఎవర్ని? నన్నా?"

"బావుందే, ఇంకెవర్ని? నిన్నే"

"ఛీ! ఎక్కడేనా పెద్దవాళ్ళని ముద్దు పెట్టుకుంటారా?" — ఆశ్చర్యంగా చూసింది రాజ్యం, మొహం చిట్లిస్తూ.

సీత కేమీ అర్థంకాలేదు, రాజ్యంతో యెలా మాట్లాడాలో తోచలేదు. కాస్సేపటికి అంది – "అయితే మీకు శోభనం చెయ్యలేదన్నమాట."

జవాబు చెప్పటం తెలీలేదు రాజ్యానికి.

సీత చాలా సేపు ఆలోచించి అంది - "ఓసే రాజీ! నీకో విషయం చెప్తానే! నీకు బొత్తిగా యేమీ తెలీదు, నాకు నీ కన్నా ముందే పెళ్ళయిందిగా మరి, మా ఆయన యెప్పుడూ నాకు ఏవో కబుర్లు చెపుతూంటాడు. నన్ను తన దగ్గరే పడుకో మంటాడు, అస్తమానం ముద్దులు పెట్టుకొంటూ వుంటాడు ...."

అసహ్యంతో మొహం ముడుచు కుంది రాజ్యం. చటుక్కున లేచి నిల బడింది — "ఛీ మా ఆయన అల్లాంటి వాడేం కాదు. ఎంతో మంచి వాడు."

"అప్పుడే లేచావేం? కూర్చో! నా మాటేగా చెపుతూంట."

"ఉఁహు! నాకేం వద్దు నే పోతున్నాను" - గాలిలా పరుగు తీసింది రాజ్యం.

"ఒసేవ్! బింది తెచ్చావే, నీళ్ళు తీసుకెళ్ళు." కనుచూపు మేరలో కన్పించలేదు రాజ్యం.

సీత నీళ్ళ బింది భుజం మీదికి ఎత్తు కుంది "దీనికి వయస్సుతో పాటు బుద్ధి పెరగలేదేం ఖర్మ?" - అనుకుంటూ.

* * *

గర్వంగా నవ్వుకొంది రాజ్యలక్ష్మి.

కాలం ఎంత చిత్రమైంది! గతం తల్చు కొంటూంటే ఎంత ఆశ్చ ర్యంగా వుంది! సుదీర్ఘమైన నాలుగు సంవత్సరాలు నాలుగు క్షణాల్లా గడిచి పోయాయి.

ఆ నాలుగేళ్లలోనూ రాజ్యం అత్తవారింటికి వెళ్లలేదు - పెళ్లయిన దగ్గర్నుంచీ కొత్త కోడలికి అత్తవారు బట్టలూ నగలూ, బహుమతులూ పంపుతూనే వున్నారు. ఓ సారి రాజ్యం అత్తగారు కోడల్ని చూడ్డానికి వచ్చినప్పుడు అంది — "మా రఘూ జాతకంలో కాస్త చిన్న తనంలోనే పెళ్లి చేస్తే క్షేమమని వుంది. బంగారు బొమ్మలాంటి పిల్లకూడా కుదిరింది. కళ్యాణం జరిపించేశాం. ఎలా చూచినా ఇద్దరూ చిన్నవాళ్ళేను. అప్పుడే ఏం కాపరాలు? అందుకే శోభనంకూడా చేయలేదు - రెండు మూడేళ్ల

పోయాక అన్ని ముచ్చట్లూ తీర్చుకోవచ్చు. జీవిత కాలమంతా ఉన్నదేగా!"

వియ్యపురాలి మాటలు ఎంతైనా నచ్చాయి రాజ్యం వాళ్ళమ్మకి — ఓ నాలుగేళ్ళపాటు పిల్లని తన చాటునే వుంచుకుంటే దానికీ కాస్త లోక జ్ఞానం తెలిసి కాపురం చేసుకుంటుంది — అనుకొంది. కూతుర్ని బొత్తిగా చిన్న పిల్లని చేసి కసరకుండా దగ్గిర కూర్చోబెట్టుకుని మాటా మంచీ చెప్పడం సాగింది. "నే వినను పో" - అంటూ పరుగెత్తే రాజ్యం కాస్సేపు కుదురుగా కూర్చోవటం నేర్చుకో గలిగింది.

"మా యింట్లో పుస్తకాలవీ వుంటాయిగా జాగ్రత్తగా తీసికెళ్ళి చదువుకోరాదూ?" — అంది ఓ సారి జానకి. రాజ్యం మూతి మూడువంకర్లు తిప్పింది — "నా కేం అక్కర్లా" — రాజ్యం వాళ్ళమ్మ కూడా కూతురికి రోజుల తరబడి నూరి పోసింది — "ఆయన బి. ఎ. పాసయ్యారు. నీకు పుస్తకం చదవటమైనా రాకపోతే ఇక నీతో ఏం మాట్లాడతాడు? జానకి ఇస్తానంటోందిగా? ఒక్కో పుస్తకం తెచ్చుకు చదువుకోరాదూ?"

గుణం కుదిరింది రాజ్యానికి. ఓ పుస్తకం తెచ్చి బొమ్మలు చూసు కొంది. ఇంకో పుస్తకంలో ఏదో కథ చదివింది. "ఇదేఁవిటి జానకీ? ఇలా వుందేం కథ? ఆ అబ్బాయి ఆ అమ్మాయి నలా పట్టుకుంటాడేం?" అంటూ సందేహం వెలిబుచ్చింది? జానకి నవ్వి మరో పుస్తకం యిచ్చింది —

సీత రెండో పురిటి కొచ్చింది — రాజ్యాన్ని చూస్తూ నవ్వుతూ అంది — "నువ్వు కాపరాని కెళ్ళలేదుగానీ, యీ సరికి నీ కొక కూతురు పుట్టేది."

రాజ్యం వొళ్ళు ఝల్లు మంది. కూతురు — తనకి అమ్మో! ఎలా? అసలు సీతకి పిల్లలెలా పుడుతున్నారు? కాపరానికి వెళ్ళటానికీ, పిల్లలు పుట్టటానికీ సంబంధ మేమిటో అంతగా అర్థంగాక పోయినా ఎందుకో కాస్త సిగ్గువేసింది రాజ్యానికి.

గబగబా యింటికెళ్ళి మంచంమీద బోర్లా పడుకొని ఎన్నడూ లేని విధంగా రాజ్యం తనలో తాను ఎన్నో ప్రశ్నలు వేసికొంది. జవాబు కోసం ఆలోచిస్తూ .... ఆ నాటినుంచీ ప్రతీ క్షణం ఆలోచిస్తూనే వుంది.

దీర్ఘంగా నిట్టూర్చింది రాజ్యలక్ష్మి.

ఓ పిచ్చి లోకంలో గంతులేస్తూ తిరిగే ఆనాటి రాజీకి, అందరిలా అవగాహన చేసుకోగలిగే తనకీ అసలు పోలికెక్కడ?

బొత్తిగా ఏమీ అర్థం చేసుకోలేని ఆ అమాయక స్థితిలోనే జీవితాంతం ఉండిపోతే ఎంత సుఖపడేది తను! రాను రాను తనకు తెలిసి వచ్చిన ఈ లోక జ్ఞానం బ్రతుకును భారం చెయ్యటానికి కాకపోతే ఎందుకు? తనకు ఆలోచించటం చేతనైంది మొదలూ, ఆ ఆలోచనల నన్నిటినీ భర్త చుట్టూనే భ్రమింప జేసింది, పెళ్ళి పీటలమీద చూడగలిగిన ఆ సుందరరూపాన్ని వేయిరెట్లు ఉన్నతం చేసుకుంది - రోజులు యుగాలుగా నిరీక్షించింది ....

కాని .... కాని ... తనకు దక్కిందేమిటి? తను అనుభవించిందేమిటి? సిగ్గుల పెళ్ళికూతురై మనస్సంతా కోరిక నింపుకొని అత్త వారింటికి వచ్చిన తను .... తెలుసుకోగలిగిన ఆ నిజం .... తన ఆశాసౌధాలను మూలమట్టంచేసిన ఆ నిజం .... తన నిండు జీవితాన్నే అంధకారమయంచేసిన ఆ నిజం .... ఎంత ఘోరమైనదీ! ఎంత భయంకరమైనదీ రాజ్యం బుగ్గలమీదుగా కన్నీటి బొట్లు జారిపోయాయి.

*　　　*　　　*

ఏదో ఉలికిడైతే ఉలిక్కిపడింది రాజ్యం. వరండా పొడుగునా దృష్టి సారించి చూసింది. ఏమీ కన్పించలేదు. మేడమీద గదులన్నీ నిశ్శబ్దంతో నిండి ఉన్నాయి. నెమ్మదిగా దృష్టిని తోటకేసి మళ్ళించుకొంది. పండు వెన్నెల్లో పునీతమౌతోంది లోకం. తోటలో విరగబూసిన పువ్వులు విస్పష్టంగా కన్పిస్తున్నాయి. సువాసనలను వెంటతెస్తున్న చల్లగాలి మృదువుగా తాకి మత్తు కలిగిస్తోంది- రాజ్యం నిర్లిప్తంగా చందమామలోకి చూస్తూ నించుంది ప్రతిమలా....

అకస్మాత్తుగా రెండు బలమైన హస్తాలు రాజ్యాన్ని చుట్టుకున్నాయి. చటుక్కున నుదుటిమీద ఓ ముద్దు ముద్ర పడింది .... పెనుగులాడుతూ కెవ్వుమని అరవబోయిన రాజ్యం నోటికి ఓ చెయ్యి అడ్డుపడింది.

నవ్వుతూ చూశాడు సుధాకర్ - "నేనే? నేనే?"- బ్రాన్పడిపోయింది రాజ్యలక్ష్మి, దీర్ఘంగా చూస్తూ ఉండిపోయింది మరిదికేసి.

సుధాకర్ అంటే రాజ్యం కేమంత అభిమానం లేదు. మంచి అభిప్రాయమూ లేదు. సంవత్సరాలతరబడి పరీక్షలు పేసవ్వని మరిది - వేలకొద్దీ రూపాయలతో తాత్కాలికంగా పరారయ్యే మరిది - ఎప్పుడూ తనకేసి కోరగా చూసి కళ్ళతో నవ్వే మరిది - విశృంఖలతకు దాసుడైన సుధాకర్ .... ఇలా అకస్మాత్తుగా .... అర్ధరాత్రి....

రాజ్యలక్ష్మి శరీరం దహించుకుపోయింది అభిమానంతో - కళ్ళ నిండా నీళ్ళు నిండాయి నిస్సహాయతతో.

"ఏమిటి ఆలోచిస్తున్నావు రాజా?"

తలెత్తింది రాజ్యం విభ్రాంతిగా - పదిమంది యెదుట మన్నించి గౌరవించే మరిది .... రెట్టించాడు సుధాకర్ - "ఏమిటో అంత మౌనం?"

"ఏం లేదు" - తల తిప్పేసుకొంటూ అంది.

"ఎందుకు లేదు? నా గురించి ఆలోచిస్తున్నావ్ కదూ? ఏం నేనేం అన్యాయం చేశానా?"

".... .... ...."

"నీ మనసంతా తీరని వేదనతో మండిపోతూంటుంది కదూ? అదేమిటో నేను చెప్పనా?"

".... .... ...."

"బ్రతుకంతా ఇంత అనుభవరహితంగా ఎలా గడుపుతావు? నీకు సుఖపడాలనే కోరిక లేదూ?"

".... ...."

"నా మాట విను రాజా! నీ జీవితానికి ఎంతో విలువ ఉంది. దాన్ని నాశనం చెయ్యకు. భగవంతుడుకూడా మెచ్చడు. నీవంటి కన్నె పిల్లల్ని ఆయ నెప్పుడూ క్షమిస్తాడు." రాజ్యం శరీరం జలదరించింది. చెంపల మీదుగా చేతులు కప్పుకొని నేల చూపులు చూస్తూ నించుంది.

"ఎందుకంత బాధపడతావు? నా గదిలోకి వస్తావా? ఏమైనా మాట్లాడుకుందాం."

మరి నిలవలేకపోయింది రాజ్యలక్ష్మి - పెల్లుబుకుతోన్న దుఃఖాన్ని

అణచిపెట్టుకుంటూ - తడబడే కాళ్ళతో నెమ్మదిగా తన గదిలోకి నడిచి తలుపులు మూసుకుంది - 'భగవాన్! నా వంటి కన్నెపిల్లని - నువ్వు క్షమిస్తావా?' దుఃఖం ఆగలేదు. సుమారు సంవత్సరం క్రిందట........ శోభనం రాత్రి....

* * *

ఆ రాత్రి....

సిగ్గుపడటం పూర్తిగా అప్పుడే తెలిసింది రాజ్యానికి. పాము కుబుసంలాంటి తెల్లటి పట్టుచీర - శంఖాలవంటి మల్లెమొగ్గల జడ — చిరునవ్వులతో మెరిసిపోతున్న మొహాన్ని దిద్దుకున్న కళ్యాణం బొట్టు. ఊహలలో తేలిపోతోన్న మనస్సు - వివశత పొందుతోన్న శరీరం........

తల దించుకుని ... క్రీకంట చూస్తూ అలా నించునే ఉంది రాజ్యం.

రఘునాధ్ .... ఇహలోక విషయాలకు అతీతుడైన యోగిలా .... పడక కుర్చీలో వెనక్కి వాలి నుదుటిమీద చెయ్యి వేసుకుని కూర్చుని ఉన్నాడు.

మెడ నొప్పి పెడుతోంటే తల ఎత్తి సన్నటి వేళ్ళతో మెడమీద ఒత్తుకొంది రాజ్యలక్ష్మి. దోమతెర చుట్టూ వ్రేళ్లాడుతోన్న పువ్వులదండ నెమ్మదిగా జారి క్రింద పడబోతే చటుక్కున మంచం దగ్గిరికి రెండడుగులు వేసి దండ అందుకుంది - గాజులు ఘల్లుమన్నాయి.

నెమ్మదిగా కళ్ళు విప్పి చూశాడు రఘునాధ్. "నిద్ర వస్తోందా? పడుకుంటావా?"

అమితంగా సిగ్గుపడిపోయింది రాజ్యలక్ష్మి.

"పడుకో రాజ్యం! ఎంతసేపు నించుంటావు?" కాదన్నట్టు తల తిప్పింది— "లేదు. నిద్ర రావటంలేదు." మళ్ళీ మౌనం! తను వచ్చినట్టు తెలిసివున్న భర్త .... ఇంతసేపటికి ఈ విధంగానా పలకరించటం? తన రాక కోసం ఆయన ఎదురు చూడటం లేదా?

మరికొంతసేపు నిలబడి కిటికీ దగ్గిరికి నడిచింది. రఘునాధ్ రాజ్యం కేసి చూశాడు.

రాజ్యం చిన్నగా నవ్వుతూ అంది – "పోనీ మీరు నిద్రపోరాదూ? ఎంత సేపలా కూర్చుంటారు?"

"లేదు రాజ్యం! నాకూ నిద్ర రావటంలేదు." అతని కంఠస్వరంలో దైన్యం ధ్వనించింది. దాన్నేమీ పట్టించుకోకుండా కాస్త ధైర్యంతో దగ్గిరికి నడిచింది. సిగ్గు కూడా కొంతవరకూ పారిపోయింది. "మీరేమిటో ఆలోచిస్తున్నారు కదూ? ఎవర్ని గురించి?" – చిలిపిగా అడిగింది.

రఘునాథ్ తదేకంగా చూశాడు రాజ్యం మొహంలోకి. రాజ్యాని కేమిటో భయం వేసింది. అతనిలో అంత ఉదాశీనత దేనికి? .... ఆ సమయంలో....

"రాజ్యం!" అతని గుండెల్లోంచి వచ్చిందా పిలుపు. ప్రేమగా చూసింది రాజ్యం – "ఏమిటి?"

"రాజ్యం! నీ కెవరైనా అన్యాయం చేస్తే నువ్వేం చేస్తావు? వాళ్లని క్షమిస్తావా?"

తేలికగా నవ్వింది. "ఎలా క్షమిస్తాను?"

"నన్నయితే?"

"ఛీ! మీరు నా కెందుకు అన్యాయం చేస్తారు?"

"నీ సుఖం నీ సంతోషం శాశ్వతంగా కరువై పోయాయని తెలిస్తే, నీ జీవితం ఒట్టి మోడయి పోయిందని గ్రహిస్తే ఏం చేస్తావు? చెప్పు రాజ్యం!"

"ఏమిటి? మీరిలా మాట్లాడుతున్నారు?"

"ఇంకెలా మాట్లాడను రాజ్యం? ఒద్దు ఒద్దనుకొంటూనే నీ మెడలో తాళి కట్టాను. మన పెళ్లి జరిగింది మొదలూ నేను ఏడవని రోజులేదు."

అయోమయంగా చూసింది రాజ్యం. "ఏం? ఏమైంది? నేనంటే మీ కిష్టంలేదా?"

విరక్తిగా నవ్వాడు రఘునాథ్ – "నువ్వంటే నా కిష్టంలేదూ? నా కోసం నీ జీవితాన్ని నాశనం చేసుకున్న నువ్వంటే నా కిష్టంలేదూ? కాని.... నా యిష్టం ఎలా వ్యక్తపరచను రాజ్యం? ఎంత ఇష్టంవుండీ ఏం ప్రయో

జనం? నిన్ను నేనేం చేసుకోను? నువ్వు నా కేమవుతావు?"

రాజ్యం గుండెలు దడదడ లాడాయి. భయంతో పిచ్చి చూపులు చూస్తూ అంది - "మీ రేమంటున్నారో నాకేమీ అర్థం కావటంలేదు. నేను మీకేమీకానా? మీ భార్యనుకానా!"

"కావు రాజ్యం! కావు. సోదరివి! తల్లివి! దేవతవి!" చెవులు మూసు కొందిరాజ్యం. బొటబొటా కన్నీళ్ళు జారిపడ్డాయి — భార్యగా యిష్టపడలేని నన్ను .... నన్ను .... మీ రెందుకు పెళ్ళి చేసుకున్నారు?"

"స్త్రీ వాంఛ లేని నపుంసకుడు ఏ స్త్రీ నైనా భార్యగా యిష్టపడ గలడా?"

అదిరిపడింది రాజ్యలక్ష్మి. రఘునాథ్ కళ్ళల్లోకి తీవ్రంగా చూస్తూ వుండి పోయింది.

"నిన్ను క్షమించమని అడిగే అర్హత నాకులేదు - కాని నేను చేసిన పొరపాటుని నీ దగ్గర ఒప్పుకోవలసిన ఘడియ వస్తుందని నాకు తెలుసు."

"....  ....  ...."

"నా బలహీనతని కనిపెట్టిన రోజుల్లో ఇంట్లో పెద్ద వాళ్ళంతా కూడ బలుక్కుని నా యిష్టాన్ని లెక్కచెయ్యకుండా గబగబా మీ సంబంధం వెదికి పెళ్ళి చేశారు. కుటుంబ గౌరవం కోసం — నా లోపాన్నెవరూ వేలెత్తి చూపకుండా వుండటంకోసం. - వైద్యాలవల్ల క్రమంగా నా రోగం చక్క బడుతుందని ఆశించినదంతా నిరాశే అయింది. ఎంతో మంది డాక్టర్లు పరీక్ష చేశారు. వైద్యం నడిపారు. ఫలితం శూన్యం. అది నా దురదృష్టం అన్నారు. కానీ ఎవరికిది దురదృష్టంగా పరిణమిస్తుందో నాకు తెలుసు. నేను మహాపాపం చేశాను రాజ్యం! నీ బ్రతుకు సర్వనాశనం చేశాను. కాని ... అదంతా నేను నా స్వార్థం కోసం మనస్ఫూర్తిగా మాత్రం చెయ్యలేదని నువ్వు విశ్వసిస్తే చాలు, నా పాపానికి పరిహారం లభిస్తుంది. నా మాటలు నమ్మ గలవా రాజ్యం?"

రాజ్యలక్ష్మి మాట్లాడలేదు. స్థాణువై పోయింది.

తల్పుకొంటూ కొద్దీ రాజ్యంఉచ్ఛ్వాస నిశ్వాసాలు తీవ్రమయ్యాయి. కళ్ళు రెండూ నిప్పుకణికల్లా జ్వలించాయి. ఆవేశంలో శరీరం వణకసాగింది!

మోసం! అంతా తనని మోసం! చేశారు. తన బ్రతుకు గాఢాంధకారం చేశారు. తనేంచెయ్యాలి? తనేం చెయ్యాలి? ఎందుకు క్షమించాలి? క్షమపొందే అర్హత ఎవరికుంది? ఉహూ! తనేమైనా చేస్తుంది. ఎవ్వరూ అడ్డగించ లేరు. భర్తే కాదు భగవంతుడు కూడా. తను సుఖపడాలి. బంధాలు తెంచు కోవాలి. నీతి నియమాలు విస్మరించాలి. తనకు జరిగిన మోసానికి ప్రతీకారం చేసి తీరాలి.

ఆవేశంతో లేచింది రాజ్యలక్ష్మి.

గది తలుపులు గెంటుకుని లోపలికి వచ్చిన రాజ్యాన్ని చేతులలోకి తీసుకుని తలుపులు మూశాడు సుధాకర్ గర్వంగా నవ్వుతూ.

* * *

"సుధ .... సుధాకర్! ...." పదే పదే ఉచ్చరించుకొంది రాజ్యం ... ఆమె కళ్ళు అరమోడ్పు లయ్యాయి. పెదవుల మీద చిరునవ్వు చిందింది.

రాజ్యలక్ష్మిలో బయలుదేరిన తెగువకు సుదాకర్ కూడా విస్తు పోయాడు .... అత్తగారి రాక తెలిసి కూడా రాజ్యం సుధాకర్ గదిలోంచి వెళ్ళలేదు. ఆవిడే చూసీ చూడనట్టు వెనక్కు వెళ్ళిపోయింది. మరోసారి — వరండా చివర చిమ్మ చీకటిలో పూల కుండీల పక్కన సుధాకర్ చేతుల్లో వున్న రాజ్యం మెట్లెక్కి వస్తోన్న రఘునాధ్‌ని చూసి కూడా తప్పుకోలేదు.

తల దించుకుపోయాడు రఘునాధ్ — రాజ్యం గర్వంగా సుధాకర్ కళ్ళల్లోకి చూసింది — "సుధా! నువ్వు నిజంగా సుధాకరుడివే? నీలో రక్తం కాదు అమృతం ప్రవహిస్తోంది" — అంది అవేశంగా.

* * *

ఉయ్యాల్లో ఊగుతున్న పసిబిడ్డ మీద చాలా చమత్కారాలు వచ్చి పడ్డాయి. .... "పిల్లాడికి పినతండ్రి పోలికలే వచ్చాయ్" పేరంటాళ్ళ హాస్యాలలో వ్యంగ్యం కొట్టవచ్చింది. రాజ్యం హృదయంలో అర్థం లేని వెర్రి ఏర్పడింది. కొడుకుని తీసుకెళ్ళి అందించి నప్పుడు పసి వాడిని హృదయానికి హత్తుకున్నాడు రఘునాధ్.

"బాబు బలహీనంగా ఉన్నాడు రాజ్యం! డాక్టర్‌కి చూపిస్తే మంచిది కదూ, పసిబిడ్డల విషయం నీకు మాత్రం ఏం తెలుసు?" — అంటూ వాడి వళ్ళు నిమర సాగాడు.

రాజ్యం తలదించుకు కూర్చోవటం తప్ప భర్త మొహంలోకి చూడ లేక పోయింది.

తర్వాత పసివాణ్ని సుధాకర్‌కి చూపిస్తే అదోరకంగా నవ్వుతూ చూశాడు ... పిల్లాడి బుగ్గమీద చిటికలేస్తూ అన్నాడు. "ఏం రా? మీ నాన్న ఎవరో నీకు తెలుసా? తెలీకపోతే మీ అమ్మని అడుగు చెపుతుంది" — అంటూ వారగా చూశాడు రాజ్యం కేసి. రాజ్యం చాలా సేపు మౌనంగానే కూర్చుంది — ఏదో గుర్తు వచ్చినవాడిలా సుధాకర్ డెస్క్ తెరిచి ఓ కవరు తెచ్చి అందిస్తూ "చూడవోయ్! మీ చెల్లాయి ఎలా ఉందో!" — అన్నాడు నవ్వుతూ. పరధ్యానంగా కవరు తెరిచిన రాజ్యం ఆశ్చర్యంగా చూసింది. — అందమైన ఆ యువతి ఫోటోకేసి.

"నీ కేమవుతుందో తోటికోడలో — సవతో ..."

రాజ్యం శరీరం గగుర్పాటు చెందింది. నేల చూపులు చూస్తూ కొంత సేపు కూర్చుంది — "నేను విన్నది అబద్ధం కాదన్నమాట."

"ఏమిటి? ఏం విన్నావు?"

రాజ్యం తలెత్తి సుధాకర్ మొహంకేసి దీక్షగా చూసింది — "నువ్వు .... పెళ్లి చేసుకుంటున్నావా సుధాకర్ ?"

"అంటే విస్మయంగా అన్నాడు సుధాకర్ — "నేను పెళ్ళి చేసుకో కూడదనా? ఎమిటి రాజా నువ్వనేది?"

రాజ్యానికి ఎంతో మాట్లాడాలని ఉంది. ఏమీ మాట్లాడ లేక పోయింది.

"నాన్నకు కట్నం నచ్చింది. అమ్మకి సాంప్రాదాయం నచ్చింది.

నాకు .... నువ్వూ చూశావ్‌గా? అందం నచ్చింది. నిజం చెప్పు, ఉర్వశిలా లేదూ? ఆ మృదువైన పెదవులూ, విశాలమైన కళ్ళూ ...."

"సుధాకర్!" – దుఃఖం అణుచుకోలేక పోయింది రాజ్యం– "అంతా నన్ను అన్యాయం చేశారు. అందర్నీ విమర్శించిన నువ్వు .... నువ్వు కూడా నన్ను మోసం చేశావు — మీకేం డబ్బుచాటున మీ లోపాలు కప్పి పుచ్చుకున్నారు. చూసీ చూడనట్టు మన సంబంధాన్ని ప్రోత్సాహించారు – ఇప్పుడు నీకు పెళ్ళి చేస్తున్నారా? పెళ్ళి"

సుధాకర్ నుదురు చిట్లించాడు – "నీకేం మతి పోయిందా? పెళ్ళి మానుకుని మన సంబంధం శాశ్వతం చేసుకున్నామని లోకానికి రుజూ చేద్దామా? నీ వంటి వాళ్ళందరికీ ఖర్మ సిద్ధాంతం ఉండనే వుందిగా."

రాజ్యంలో క్రోధావేశం కట్టలు తెంచుకుంది –– నా ఖర్మకు బడి నన్ను ఏడవనివ్వకుండా నువ్వెందుకు నా దారికి అడ్డు తగిలావు?"

"నేను అడ్డుతగలక పోతే నీ దారి నిరాటంకంగా సాగేదేనా?"

"సుధాకర్!"

"కోపగించు కోకు రాజూ! ఒక్కటి ఆలోచించు — నీలా నన్నూ మూగ బ్రతుకు బ్రతక మంటావా? నీకు మతి వుండే మాట్లాడుతున్నావా?"

నిజంగా మతి పోయినట్టే చూసింది రాజ్యలక్ష్మి.

(1964 ఆగస్టు "అభిసారిక" నుంచి)